క్లుప్తంగా

అంతర్జాతీయ స్విమ్మింగ్ పోటీలకు విద్యార్థి ఎంపిక

గన్నవరం: మండలంలోని దావాజిగూడెంలో ఉన్న స్పందన మానసిక వికాస కేంద్రానికి చెందిన విద్యార్థి యాదాల సంకీర్త్ అంతర్జాతీయ స్విమ్మింగ్ పోటీలకు ఎంపికైనట్లు హెల్పింగ్ హ్యాండ్స్ సొసైటీ చైర్మన్ సంకాబత్తుల వెంకట్ ఆదివారం ఓ ప్రకటనలో తెలిపారు. బ్రెజిల్‌లో 2024 జనవరిలో జరగనున్న అంతర్జాతీయ స్విమ్మింగ్ పోటీల్లో సంకీర్త్ పాల్గొంటారని పేర్కొన్నారు.

తైక్వాండోలో ఉయ్యూరు విద్యార్థుల ప్రతిభ



ఉయ్యూరు: తైక్వాండో పోటీల్లో ఉయ్యూరు విద్యార్థులు సత్తా చాటారు. ఇటీవల ఒంగోలులో 26వ నేషనల్ ఐటీఎఫ్ తైక్వాండో చాంపియన్ షిప్ పోటీలు నిర్వహించారు. ఈ పోటీలకు కృష్ణాజిల్లా ఐటీఎఫ్ తైక్వాండో అసోసియేషన్ ఆధ్వర్యంలో ఉయ్యూరు విద్యార్థులు పాల్గొని ప్రతిభ చాటారు. ఎం.హరిణి, కె. అక్షయ్, బి.కీర్తన బంగారు పతకాలను, వై.రమా శ్రీదేవి, గుణరేవంత్, హేమంత్ రజత పతకాలు, యోగ్యశ్రీ, ధన్షిత, మోహిత్, కాంస్య పతకాలు సాధించారు. పతకాలు పొందిన విద్యార్థులను వాకర్స్ యూనియన్ ఆదివారం అభినందించింది. విద్యార్థులను ఉయ్యూరు పట్టణ ఎస్ఐ వాసు, వాకర్స్ యూనియన్ సభ్యులు నూకల వెంకట సాంబశివరావు, డాక్టర్ సంగం తిరుమలరావు, ఊర కిషోర్‌కుమార్, అబ్దుల్ సద్దాం అభినందించారు.

నేడు సైన్స్ ఎగ్జిబిషన్

కంకిపాడు: మండల స్థాయి సైన్స్ ఎగ్జిబిషన్ పునాదిపాడు జెడ్పీ పాఠశాలలో సోమవారం నిర్వహించనున్నట్లు ఎంఈఓ కె.ప్రసాద్ తెలిపారు. ఆదివారం ఆయన విలేకరులతో మాట్లాడుతూ మండలంలోని వివిధ పాఠశాలల నుంచి విద్యార్థులు రూపొందించిన నమూనాలను ప్రదర్శిస్తారని పేర్కొన్నారు.

నేడు 'స్పందన'

విజయవాడరూరల్: ప్రజా సమస్యల పరిష్కార వేదిక స్పందన కార్యక్రమం సోమవారం ఉదయం 10.30 గంటల నుంచి రూరల్ తహసీల్దారు కార్యాలయంలో నిర్వహించనున్నట్లు తహసీల్దార్ కె.లక్ష్మీ ఒక ప్రకటనలో తెలిపారు. మండలంలోని ప్రజలు తమ సమస్యలను స్పందన కార్యక్రమంలో పాల్గొనే అధికారులకు అందజేయవచ్చని పేర్కొన్నారు. ఎంపీడీఓ కార్యాలయంలో కూడా ఉదయం 10.30 గంటల నుంచి స్పందన కార్యక్రమం నిర్వహించనున్నట్లు ఎంపీడీఓ బి.భార్గవి ఒక ప్రకటనలో తెలిపారు. ప్రజలు తమ సమస్యలను అధికారులకు అర్జీల ద్వారా తెలియజేసి, పరిష్కారం పొందవచ్చని తెలిపారు.

ఏడుగురు జూదరుల అరెస్ట్

గన్నవరం: మండలంలోని మర్లపాలెం శివారులో జరుగుతున్న పేకాట శిబిరంపై ఆదివారం పోలీసులు దాడిచేసి ఏడుగురు జూదరులను అరెస్ట్ చేశారు. పోలీసుల కథనం మేరకు మర్లపాలెం శివారులోని పొలాల్లో పేకాట శిబిరం నిర్వహిస్తున్నారు. సమాచారం అందుకున్న ఎస్ఐ నవీన్ నేతృత్వంలో సిబ్బంది దాడిచేసి ఏడుగురు జూదరులను అదుపులోకి తీసుకున్నారు. వీరి నుంచి రూ. 11,200, ఐదు ద్విచక్ర వాహనాలను స్వాధీనం చేసుకున్నారు. అనంతరం జూదరులను స్టేషన్‌కు తరలించి కేసు నమోదు చేసినట్లు ఎస్ఐ తెలిపారు.

అత్తింటివారిపై వరకట్నం వేధింపు కేసు

పెనమలూరు: వరకట్నం కోసం వేధిస్తున్న అత్తింటివారిపై పోలీసులు ఆదివారం కేసు నమోదు చేశారు. పెనమలూరు సీఐ రామారావు కథనం మేరకు తాడిగడప కార్మికనగర్‌కు చెందిన గుండిమేడ నిహారికకు జనవరి 2023 సంవత్సరంలో పెదపులిపాక గ్రామానికి చెందిన గుండిమేడ నాగమధుతో పెద్దల సమక్షంలో వివాహం జరిగింది. పెళ్లి సందర్భంగా కట్నకానుకలు ఇచ్చారు. పెళ్లి జరిగిన తరువాత నుంచి భర్తతో పాటు అత్త కనకదుర్గ, మామ దుర్గారావు, ఆడపడుచు స్వాతి అదనపుకట్నం తీసుకురమ్మని వేధించసాగారు.దీంతో బాధితురాలు పోలీసులను ఆశ్రయించి ఫిర్యాదు చేసింది. పోలీసులు అత్తింటివారిపై కేసు నమోదు చేశారు.

సాక్షి
సాక్షి దినపత్రికలో ప్రకటనల కోసం మీ ప్రాంతంలో మా ప్రతినిధులు అందుబాటులో ఉన్నారు.
వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు
వ్యాపార, ఉద్యోగ, బహిరంగ ప్రకటనలు
శ్రద్ధాంజలి, నిర్యాణము, వర్ధంతి మొదలగు
అన్ని రకాల ప్రకటనలు ఇవ్వదలిచిన వారు సంప్రదించండి.
పెనమలూరు డివిజన్
90105 77706 (ఉయ్యూరు)
99122 20539 (పెనమలూరు)
90102 10382 (గన్నవరం)
Office mail : sakshiads@gmail.com

ముమ్మరంగా వ్యవసాయ పనులు



ప్రొద్దుటూరులో నేల వాలిన వరి దుబ్బులను కోత కోస్తున్న కూలీలు



మంతెనలో ధాన్యం ఆరబోత పనుల్లో కూలీలు



ఈడ్పుగల్లు నుంచి దావులూరు మిల్లుకు తరలిస్తున్న ధాన్యం



కంకిపాడు మార్కెట్ యార్డ్‌లో నిలువ చేసిన ధాన్యం బస్తాలు

ఖరీఫ్ పనులు ముమ్మరంగా సాగుతున్నాయి. మిచాంగ్ తుపాను ప్రభావం నుంచి కోలుకున్న రైతులు వరి కోత పనులను వేగవంతం చేశారు. పెనమలూరు నియోజకవర్గంలోని వివిధ గ్రామాల్లో వరి కోత పనులు, నీటి ముంపునకు గురైన వరి పనలను, నేలవాలిన వరి పంటను సంరక్షించుకునే పనుల్లో రైతులు నిమగ్నమయ్యారు. ధాన్యం ఆరబోసి మిల్లులకు తరలిస్తున్నారు. అటు రైతులు ఇటు కూలీలు ఖరీఫ్ వ్యవసాయ పనుల్లో బిజీగా ఉన్నారు.

- కంకిపాడు

సర్వమానవాళి కోసం ఏసుక్రీస్తు జననం

నున్న(విజయవాడరూరల్): సర్వమానవాళి కోసం ఏసుక్రీస్తు జన్మించారని స్పందన సేవాసమితి అధ్యక్షుడు ఇమ్మానేని కృష్ణప్రసాద్ పేర్కొన్నారు. ఆదివారం నున్న గ్రామంలో ప్రసిద్ధి చెందిన సీఎస్ఐ చర్చిలో సెమీ క్రిస్మస్ వేడుకలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా కృష్ణప్రసాద్ మాట్లాడుతూ ప్రేమ, కరుణ, దయ, సహనంతో ఏసుక్రీస్తు సర్వ లోకాన్ని ప్రేమించారన్నారు. ఏసుక్రీస్తు మతం కాదు, మార్గమని డీసీసీ చైర్మన్ కె.జాన్ వెస్లీ తన సందేశంలో తెలియజేశారు. సోదరి హెప్సీబారాణి మాట్లాడుతూ ఎన్నడూ విడువని ఎడబాయని దేవుని కృప అందరూ పొందాలన్నారు. అనంతరం 25 మంది పేద మహిళలకు నిత్యావసర వస్తువులను స్పందన సేవాసమితి అందజేసింది. తొలుత సెమీ క్రిస్మస్ కేక్ కట్ చేసి స్వీట్లు, పండ్లు పంపిణీ చేశారు. కార్యక్రమంలో లీగల్ అడ్వైజర్



సంఘస్తులకు క్రిస్మస్ కానుకలు అందజేస్తున్న స్పందన సేవా సమితి ప్రతినిధులు

పి.రాము, ఎంజీ బాపూజీ, ఎ.యశోద, రవీంద్ర, కామేశ్వరావు, దుర్గాప్రసాద్, సంఘ పెద్దలు తగరం బాబురావు, పుష్పనాథం, తగరం శిఖామణి, పర్సా యేసోబు పాల్గొన్నారు.

ధనుర్మాస మహోత్సవాలు ప్రారంభం



దావాజిగూడెం(గన్నవరం): మండలంలోని దావాజిగూడెంలోని సీతారామచంద్రస్వామి దేవస్థానంలో ధనుర్మాస మహోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. తెల్లవారుజామున శ్రీగోదాదేవి, శ్రీకృష్ణస్వామి వార్లకు సుప్రభాత సేవ, విశేష అర్చనలు జరిపారు. అనంతరం భక్తులతో నగర సంకీర్తన, తిరుప్పావై ప్రబంధ పారాయణం, భగవన్నామ సంకీర్తనలు జరిపారు. ఈ సందర్భంగా పెద్ద సంఖ్యలో భక్తులు ధనుర్మాస వ్రత దీక్షను స్వీకరించారు. అనంతరం భక్తులకు తీర్థ ప్రసాద వితరణ చేశారు. ఆలయ అర్చకులు ఎస్.రామాచార్యులు పాల్గొన్నారు.

ఆరోగ్యశ్రీపై అవగాహన

గన్నవరం రూరల్: మండలంలోని గ్రామాల్లోని సచివాలయాల్లో సోమవారం ఆరోగ్య శ్రీపై అవగాహన కార్యక్రమం నిర్వహిస్తున్నట్లు ఎంపీడీఓ సత్యకుమార్ తెలిపారు. ఆదివారం ఆయన మాట్లాడుతూ ప్రతి ఒక్కరికీ ఉచితంగా ఆరోగ్య సేవలు అందించేందుకు ప్రభుత్వం కృషి చేస్తుందని చెప్పారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ప్రారంభించే ఈ కార్యక్రమంపై అన్ని సచివాలయాల్లో సిబ్బంది పాల్గొని అవగాహన పెంచుకోవాలని వివరించారు. దీంతో ప్రజలకు మరింత విస్తృత సేవలు లభిస్తాయన్నారు. ప్రభుత్వం ఆరోగ్య శ్రీ ద్వారా అందించే సహాయాన్ని పెంచిందని, పూర్తి అవగాహన పెంచుకునేందుకు ఏర్పాటు చేసిన ఈ మహత్తర అవకాశం వినియోగించుకోవాలని ఆదేశించారు. త్వరలో కొత్తగా ఆరోగ్య శ్రీ కార్డులు ప్రభుత్వం అందిస్తుందని చెప్పారు.

ఘనంగా సుబ్రహ్మణ్య షష్ఠి

మధురానగర్(విజయవాడసెంట్రల్): మధురానగర్ పుట్టవీధిలోని స్వయంభూ శ్రీ బాల సుబ్రహ్మణ్యేశ్వర స్వామివారి దేవాలయంలో సుబ్రహ్మణ్యేశ్వర షష్ఠి మహోత్సవాలు ఆదివారం ఘనంగా ప్రారంభమయ్యాయి. మూడు రోజుల పాటు జరిగే సుబ్రహ్మణ్యేశ్వర షష్ఠి కార్యక్రమానికి ఆలయ ధర్మకర్తల కుటుంబ సభ్యుడు బోయిన పాండురంగరావు జానకి దంపతులు గణపతి పూజతో అంకురార్పణ చేశారు.

కళాకారుల ప్రతిభను ప్రోత్సహించాలి

విజయవాడకల్చరల్: కళాకారులలోని ప్రతిభను గుర్తించి ప్రోత్సహించాలని గుమ్మడి కళాపీఠం వ్యవస్థాపకుడు గుమ్మడి విజయకుమార్ అన్నారు. శుభకరీ నాటక కళాపరిషత్, డాక్టర్ రామన్ ఫౌండేషన్ శ్రీ సాయిబాబా నాట్యమండలి, మంగమ్మతల్లి కళా నాట్యమండలి, స్నేహాలయ ఆర్ట్స్ ఆధ్వర్యంలో గాంధీనగర్ కౌతా పూర్ణానందం కళావేదిక మీద సంప్రదాయ నృత్య ప్రదర్శనలు, సీనియర్ మేకప్‌మెన్ బాటాన తాతినాయుడుకు స్వర్ణకంకణ బహూకరణ మహోత్సవం కార్యక్రమాన్ని ఆదివారం నిర్వహించారు. ఈ సందర్భంగా విజయకుమార్ మాట్లాడుతూ ప్రతిభ కలిగిన కళాకారుడు తాతినాయుడని అభివర్ణించారు. డాక్టర్ రామన్ ఫౌండేషన్ శ్రీ సాయిబాబా నాట్యమండలి అధ్యక్షుడు డాక్టర్ పీవీఎన్ కృష్ణ మాట్లాడుతూ నాటక, సినిమా రంగానికి మేకప్ ప్రధాన పాత్ర పోషిస్తుందన్నారు. మహానటి సావిత్రి కళాపీఠం వ్యవస్థాపకురాలు పరచూరి విజయలక్ష్మి కళాకారుల్లోని ప్రతిభను గుర్తించాలని సూచించారు. నిర్వాహకులు తాతినాయుడుకు స్వర్ణకంకణం బహూకరించారు. అనంతరం దంపతులను ఆత్మీయంగా సత్కరించారు. సాంస్కృతిక కార్యక్రమంలో భాగంగా యల్లా జోస్యుల అనురాధ, మద్దాలి సాయిచంద్రిక బృందం సంప్రదాయ నృత్యాలను ప్రదర్శించింది. కార్యక్రమంలో బ్రాహ్మణ సేవా సంఘం రాష్ట్ర అధ్యక్షుడు కొప్పరపు బలరామకృష్ణమూర్తి, రంగస్థల నటుడు నాట్యాచార్యులు భగవతుల వెంకట్రామశర్మ, వివిధ రంగాలకు చెందిన ప్రతినిధులు పాల్గొన్నారు.



తాతినాయుడుకు స్వర్ణకంకణం బహూకరిస్తున్న విజయకుమార్, పీవీఎన్ కృష్ణ, విజయలక్ష్మి

సర్వశుభకరుడు సుబ్రహ్మణ్యుడు

విజయవాడకల్చరల్: సర్వశుభకరుడు శ్రీ సుబ్రహ్మణ్యుడని శివజ్ఞాన పీఠాధిపతి శివచార్య స్వామి అన్నారు. శివజ్ఞానపీఠం ఆధ్వర్యంలో దుర్గాపురంలోని సంగీత కళాశాలలో నిర్వహిస్తున్న శ్రీవైభవ సర్వసుబ్రహ్మణ్యయాగ క్రతువు ఆదివారం రెండో రోజుకు చేరుకుంది. శివస్వామి మాట్లాడుతూ సుబ్రహ్మణ్య స్వామి అర్చన, యాగ క్రతువుల వల్ల దోషాలు నశించి శుభాలు కలుగుతాయన్నారు. భారతీయ ఆధ్యాత్మిక వైభవం ప్రపంచానికి ఆదర్శంగా నిలుస్తోందని యువతను ఆధ్యాత్మిక, భక్తి భావన వైపు మళ్లించాల్సిన అవసరముందని చెప్పారు. స్వామిజీలు, ఆచార్యులు ఉపదేశాలను పాటించాలని కోరారు. ఉదయం కార్యక్రమంలో భాగంగా నిత్యవిధి, ద్వితీయకాల యాగ పూజ, మాడవీధి ఉత్సవం వైభవంగా నిర్వహించారు. యాగంలో పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. కార్యక్రమంలో పేర్ల రాంప్రసాద్ కె.విద్యాధరరావు, గార్లపాటి సుదర్శన్, పెనుగొండ సుబ్బారాయుడు పవిత్ర డైమండ్స్ రాజేష్ పాల్గొన్నారు. భక్తులకు తీర్థప్రసాదాలను అందజేశారు.



దుర్గాపురంలో యాగం జరిపిస్తున్న శివచార్య

నేటి కార్యక్రమాలు

సోమవారం నాటి కార్యక్రమంలో నిత్యవిధి, చతుర్థకాల పూజ, శ్రీ సుబ్రహ్మణ్య మూలమంత్రహోమం జరుగుతాయని మాతా శివచైతన్య చెప్పారు. వాసుదేవానందగిరి స్వామి పాల్గొంటారన్నారు.

వైభవంగా శ్రీవారి కల్యాణం

వన్‌టౌన్(విజయవాడపశ్చిమ): వన్‌టౌన్‌లోని శ్రీ వేంకటేశ్వరస్వామి వారి కల్యాణం ఆదివారం వైభవంగా జరిగింది. బ్రాహ్మణవీధిలో దేవదాయ ధర్మదాయ శాఖ పరిధిలోని పురాతన ఆలయాల్లో ఒకటైన శ్రీ వేంకటేశ్వరస్వామి వారి దేవస్థానంలో స్వామి జన్మనక్షత్రమైన శ్రవణా నక్షత్రాన్ని పురస్కరించుకొని స్వామి వారికి ఆదివారం శాంతి కల్యాణోత్సవాన్ని నేత్రపర్వంగా నిర్వహించారు. ధనుర్మాసంలో వచ్చిన శ్రవణ నక్షత్రం కావటంతో అత్యంత పవిత్రమైనదిగా భావించి భక్తులు తరలివచ్చారు. ధనుర్మాసం తొలిరోజునే స్వామి వారి శ్రవణా నక్షత్రం రావడంతో విశేషంగా భావించి పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆలయ ప్రాంగణంలోని శ్రీకృష్ణ మండపంలో స్వామి వారి ఉత్సవమూర్తులను మేళతాళాలతో తీసుకొచ్చి కల్యాణవేదికపై వేంచేయించారు. అనంతరం ఆలయ అర్చక స్వాములు పి.రామచంద్రమూర్తి పర్యవేక్షణలో స్వామి వారి కల్యాణోత్సవాన్ని నిర్వహించారు. తొలుత విష్వక్సేనపూజతో కల్యాణోత్సవానికి శ్రీకారం చుట్టారు. అనంతరం మహాసంకల్పం, ప్రవర, యజ్ఞపవీతధారణ, జీలకర్రబెల్లం ధారణ, మంగళ్యధారణ, చివరిగా తలంబ్రాల సమర్పణ కార్యక్రమాలను శాస్త్రోక్తంగా చేపట్టారు. ఈ సందర్భంగా భక్తులు స్వామి వారి ఉత్సవమూర్తులకు ప్రత్యేక పూజలు జరిపారు.



స్వామి వారి కల్యాణోత్సవం

వైభవంగా తిరుమంజనం

స్వామి వారి జన్మనక్షత్రాన్ని పురస్కరించుకుని ఆలయంలోని స్వామి వారి మూలవిరాట్‌కు తిరుమంజన కార్యక్రమాన్ని వైభవంగా నిర్వహించారు. వివిధ ఫల, సుగంధ ద్రవ్యాలతో, పంచామృతాలతో స్వామిని అభిషేకించారు. అనంతరం స్వామికి ప్రత్యేక అలంకారం చేశారు. అధిక సంఖ్యలో భక్తులు స్వామిని దర్శించుకున్నారు.

మధుర స్వరాల కంఠశాల ఘంటసాల

విజయవాడకల్చరల్: మధుర స్వరాల కంఠశాల ఘంటసాల అని పద్మశ్రీ ఘంటశాల, వి.రామకృష్ణ సాంస్కృతిక సేవా సంస్థ(ఒంగోలు) పెండ్యాల సాయి మాష్టారు అన్నారు. పద్మశ్రీ ఘంటసాల, వీ రామకృష్ణ సాంస్కృతిక సేవా సంస్థ ఆధ్వర్యంలో గాయకుడు ఘంటసాల 101వ జయంతి, సినీ నటుడు అక్కినేని నాగేశ్వరరావు శత జయంతి వేడుకలు, సినీ సంగీత విభావరి కార్యక్రమాన్ని గాంధీనగర్ హనుమంతరాయ గ్రంథాలయంలో ఆదివారం నిర్వహించారు. కార్యక్రమాలను ప్రారంభించిన సాయి మాష్టారు మాట్లాడుతూ తెలుగు పాటకు జాతీయ స్థాయి గుర్తింపు తెచ్చిన గాయకుడు ఘంటసాల మాష్టారన్నారు. అక్కినేని నాగేశ్వరరావు లేని తెలుగు సినిమా పరిశ్రమను ఊహించలేమని ఇద్దరూ కృష్ణాజిల్లా వారు కావడం తెలుగు సినిమా పరిశ్రమ చేసుకున్న అదృష్టమన్నారు.

అక్కినేని, ఘంటసాల కాంబినేషన్‌లో అనేక చిత్రాలు విజయవంతమయ్యాయని చెప్పారు. స్వరాంజలి కార్యక్రమంలో భాగంగా గాయనీ గాయకులు పెండ్యాల మాష్టారు, మువ్వా నాగేశ్వరరావు, బియ్యపు శ్రీను, రామయ్య, సంజీవ్, సౌజన్య సుహాసిని తదితరులు ఘంటసాల, రామకృష్ణ గానం చేసిన గీతాలను మధురంగా గానం చేశారు. నిర్వాహకులు ఘంటసాల, అక్కినేని, రామకృష్ణ చిత్రపటాలకు నివాళులర్పించారు. కార్యక్రమంలో డ్రీమ్ ఆడియో అధినేత చావా నరసింహారావుతో, పెద్ద సంఖ్యలో ఘంటసాల అభిమానులు పాల్గొన్నారు.

ఘనంగా పెన్షనర్ల దినోత్సవం

గన్నవరం: పెన్షనర్ల సమస్యల పరిష్కారంపై ప్రభుత్వాలు ప్రత్యేక శ్రద్ధ వహించాలని ప్రముఖ ఆర్థిక విశ్లేషకులు గన్నె వెంకట్రావు పేర్కొన్నారు. స్థానిక విశ్రాంత ఉద్యోగుల సేవాభవన్‌లో ఆదివారం ఏపీ రాష్ట్ర ప్రభుత్వ విశ్రాంత ఉద్యోగుల అసోసియేషన్ ఆధ్వర్యంలో పెన్షనర్ల దినోత్సవాన్ని ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా గన్నె మాట్లాడుతూ ప్రతి ఉద్యోగికి పెన్షన్ ప్రాథమిక హక్కుగా పేర్కొన్నారు. ఉద్యోగి తన సర్వీసులో దాచుకున్న ధనాన్ని పదవీ విరమణ అనంతరం పొందే పెన్షన్‌ను తీసివేసే హక్కు ఎవరికీ లేదన్నారు. పెన్షనర్లు గౌరవంగా జీవించేటట్లు చూడడం ప్రభుత్వాల బాధ్యతగా గుర్తించాలని కోరారు. పెన్షనర్ల సమస్యల పరిష్కారానికి తమ సంఘం అవిశ్రాంతంగా పోరాడుతుందని సంఘ అధ్యక్షుడు ఆవుటపల్లి మోహన్‌రావు తెలిపారు. అనంతరం 75 ఏళ్లు పైబడిన ఆరుగురు రిటైర్డ్ ఉద్యోగులను సత్కరించారు. ఎస్టీఓ టి. నాగరాజు, సీనియర్ సిటిజన్స్ వెల్ఫేర్ అసోసియేషన్ జిల్లా సంయుక్త కార్యదర్శి సూరగాని వెంకటేశ్వరరావు, సంఘ కార్యదర్శి షేక్ ఆదంవల్లీ సాహెబ్, కోశాధికారి బీ కృష్ణారావు పాల్గొన్నారు.

ఉయ్యూరులో..

ఉయ్యూరు: సీనియర్ సిటిజెన్స్‌ను గౌరవించడం బాధ్యతగా భావించాలని లయన్స్ జిల్లా క్యాబినెట్ ట్రెజరర్ నూకల వెంకట సాంబశివరావు అన్నారు. పెన్షనర్స్ అసోసియేషన్, లయన్స్‌క్లబ్ ఆఫ్ ఉయ్యూరు సంయుక్త ఆధ్వర్యంలో పట్టణంలోని విజ్ఞాన కేంద్రంలో జాతీయ పెన్షనర్స్ దినోత్సవం ఆదివారం ఘనంగా నిర్వహించారు. పెన్షనర్స్‌ను సత్కరించి, సీనియర్ సిటిజెన్స్ విలువను తెలియజేశారు. క్లబ్ అధ్యక్షుడు ఎండీ ఇస్మాయిల్, ప్రతినిధులు వీణవాహి ప్రసాద్, అసోసియేషన్ ప్రతినిధులు హసన్ అహ్మద్, కోటేశ్వరరావు, విశ్వమోహన్, సత్యనారాయణ, నాంచారయ్య పాల్గొన్నారు.



ఉయ్యూరులో పెన్షనర్లను సత్కరిస్తున్న లయన్స్ ప్రతినిధులు

డీఎస్ నకారా సేవలు మరువలేనివి

హనుమాన్‌జంక్షన్ రూరల్: విశ్రాంత ప్రభుత్వ ఉద్యోగుల పెన్షన్ కోసం అవిశ్రాంత పోరాటం చేసిన డీఎస్ నకారా సేవలు మరువలేనివని పలువురు కొనియాడారు. స్థానిక ఏలూరురోడ్డులోని మానవత కార్యాలయంలో జాతీయ పెన్షనర్ల దినోత్సవాన్ని ఆదివారం నిర్వహించారు. తొలుత డీఎస్ నకారాకు విశ్రాంత ఉద్యోగులు ఘన నివాళి అర్పించారు. అనంతరం సీనియర్ పెన్షనర్లు అక్కినేని రాఘవేంద్రరావు, విజయలక్ష్మి దంపతులను విశ్రాంత ఉద్యోగులు సత్కరించారు. హనుమాన్ జంక్షన్ విశ్రాంత ఉద్యోగుల సంఘం నాయకులు మారుబోయిన కోటేశ్వరరావు, వేగిరెడ్డి సూర్యనారాయణ, భూమా పుల్లారావు, ఘంటా సత్యనారాయణ, చక్కా సుబ్బారావు, కళ్లేపల్లి నారాయణరావు, వడ్డి రాజేశ్వరరావు, పొట్లూరి శేషాచలం, నూకల సూర్యనారాయణ పాల్గొన్నారు.

రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలి

పెనమలూరు: రౌడీషీటర్లు సత్ప్రవర్తనతో మెలగాలని, లేకపోతే కఠిన చర్యలు తీసుకుంటామని సీఐ టీవీవీ రామారావు అన్నారు. పెనమలూరు పోలీస్ స్టేషన్‌లో ఆదివారం రౌడీషీటర్లకు సీఐ కౌన్సిలింగ్ ఇచ్చారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పెనమలూరు పోలీస్‌స్టేషన్ పరిధిలో నేరాలు చేసిన వారిపై రౌడీషీట్‌ను గతంలో తెరిచామన్నారు. త్వరలో జరగనున్న ఎన్నికల సమయంలో రౌడీషీటర్లు ఏ రాజకీయ పార్టీలకు ప్రచారం చేయరాదని తెలిపారు. ఎన్నికల సమయంలో వారు బయట తిరగరాదని పేర్కొన్నారు. రౌడీషీటర్లు ఉద్యోగాలు, ఉపాధి అవకాశాలు చూసుకుని జీవన విధానంలో మార్పు తెచ్చుకోవాలని సూచించారు. రౌడీషీటర్లు చట్టవ్యతిరేక కార్యకాలాపాలకు పాల్పడితే కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.



రౌడీషీటర్లకు కౌన్సిలింగ్ ఇస్తున్న సీఐ రామారావు

విద్యలో రాణిస్తేనే ఎదుగుదల సాధ్యం

హనుమాన్‌జంక్షన్ రూరల్: విద్యలో రాణించటం ద్వారానే సామాజికంగా, ఆర్థికంగా, రాజకీయంగా కాపుల ఎదుగుదల సాధ్యమని రిటైర్డ్ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ జోన్నలగడ్డ ప్రభాకరరావు అన్నారు. స్థానిక విజయవాడరోడ్డులోని దుట్టా కృష్ణామూర్తి బృందావన్ గార్డెన్స్‌లో హనుమాన్‌జంక్షన్ పట్టణ, బాపులపాడు మండల కాపు వనసమారాధన ఆదివారం జరిగింది. ముఖ్య అతిథిగా విచ్చేసిన రిటైర్డ్ ఐజీ ప్రభాకరరావు మాట్లాడుతూ కాపు సామాజికవర్గం ఐకమత్యంగా మెలగాలని సూచించారు. ప్రముఖ పారిశ్రామిక వేత్త, గ్రీన్ కో గ్రూపు సలహాదారుడు బండారు నరసింహరావు, వైఎస్సార్ సీపీ సీనియర్ నేత డాక్టర్ దుట్టా రామచంద్రరావు మాట్లాడుతూ కాపులు ఒకరికొకరు తోడ్పాటును అందించుకుంటూ కలసికట్టుగా అభివృద్ధి సాధించాలని ఆకాంక్షించారు. తల్లిదండ్రులు ఎన్ని ఆర్థిక ఇబ్బందులు ఉన్నప్పటికీ పిల్లలను కచ్చితంగా ఉన్నత చదువులు చదివించాలని కోరారు. సినీ నటుడు, రచయిత వడ్డి మహేష్ మాట్లాడుతూ కాపులు జనభా ప్రతిపాదికన రాజ్యాధికారంలోనూ వాటా సాధించాలని చెప్పారు. తొలుత చిన్నారుల ప్రదర్శించిన శాస్త్రీయ నృత్య ప్రదర్శన వీక్షకులను ఆకట్టుకుంది. రైల్వే ఉద్యోగి దుట్టా సమంతకమణి నేతృత్వంలో మహిళలు, చిన్నారులకు ఆటలపోటీలు నిర్వహించి, విజేతలకు అతిధుల చేతుల మీదగా బహుమతులు పంపిణీ చేశారు.



కాపు వనసమారాధనలో మాట్లాడుతున్న రిటైర్డ్ ఐజీ ప్రభాకరరావు

అథ్లెటిక్ చాంపియన్ షిప్‌లో ప్రతిభ

ఆటోనగర్(విజయవాడతూర్పు): 67వ ఆంధ్రప్రదేశ్ అంతర్ జిల్లాల స్కూల్ గేమ్స్ అథ్లెటిక్ చాంపియన్ షిప్‌లో విజయవాడ రాధానగర్ మౌంట్ కర్మేల్ స్కూల్‌కు చెందిన విద్యార్థిని ఎస్. సాయిదుర్గ వెండి పతకం సాధించారు. పల్నాడు జిల్లా నరసరావుపేటలో ఈ నెల 12, 13, 14 తేదీల్లో పోటీలు జరిగాయి. అండర్(17) మూడు వేల మీటర్ల రేస్ వాకింగ్‌లో వెండి పతకం సాధించినట్లు స్కూల్ హెచ్ఎం వి.నిర్మల తెలిపారు. ఈ సందర్భంగా విద్యార్థినిని స్కూలు యాజమాన్యం, ఉపాధ్యాయులు అభినందించారు.



ఇన్‌చార్జి కార్యదర్శిగా చెన్నకేశవరావు

నున్న(విజయవాడరూరల్): నున్న గ్రామ పంచాయతీ కార్యదర్శి జీటీవీ రమణ వారం రోజుల పాటు సెలవులో ఉన్నందును ఆయన స్థానంలో ఇన్‌చార్జి కార్యదర్శిగా ఎస్.చెన్నకేశవరావు(పాతపాడు)ను ప్రభుత్వం నియమించింది. రామవరప్పాడు పంచాయతీ కార్యదర్శి రామోహనరావు సెలవులో ఉన్నందున ఆయన స్థానంలో ప్రసాదంపాడు కార్యదర్శి రాజేంద్రప్రసాద్‌ను ఇన్‌చార్జి కార్యదర్శిగా ప్రభుత్వం నియమించినట్లు ఈఓఆర్డీ బీఎల్‌వీ శేషగిరావు తెలిపారు.

CHANGE OF NAME
I, MALLAVALLI VENKATA SITA PARVATHI (old name) D/o. GANGADHARA RAO MALLAVALLI., resident of D.No.5-67/1, DNR Colony Center, Opp. Ranga Statue, Kanuru, Vijayawada rural, NTR District, A.P., India., Have changed my name as PALAGANI VENKATA SIVA PARVATHI (New Name) W/o. PALAGANI VENKATESWARA RAO. Hereafter my name is known as PALAGANI VENKATA SIVA PARVATHI for all purposes.

